క్లుప్తంగా

నకిలీ మద్యంపై నేడు నిరసన ర్యాలీ

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలు హరిస్తున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎంపీ, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ అధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం పది గంటలకు వీఎల్ పురంలోని మార్గాని ఎస్టేట్‌లో పార్టీ సిటీ కార్యాలయం నుంచి జేఎన్ రోడ్ రామాలయం వద్ద జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కార్యాలయం వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించి, అనంతరం వినతిపత్రం అందజేస్తారని పార్టీ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. రాజమహేంద్రవరం సిటీ పరిధిలోని పార్టీ నేతలు, మహిళా నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ హైకోర్టు జడ్జి నర్సరీ సందర్శన



హైకోర్టు జడ్జి మాధవీదేవికి మొక్కను అందిస్తున్న ఆంజనేయులు

కడియం: కడియపులంకలోని శ్రీసత్యదేవా నర్సరీని ఆదివారం తెలంగాణ హైకోర్టు జడ్జి టి.మాధవీదేవి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమెకు నర్సరీ అధినేత పుల్లా ఆంజనేయులు మనీ ప్లాంట్ గోల్డ్ మొక్కను అందించి స్వాగతం పలికారు. నర్సరీలో మొక్కలు, వాటి విశిష్టతను ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా మాధవీదేవి మాట్లాడుతూ, నర్సరీల అందాలు చూడముచ్చటగా ఉన్నాయన్నారు. మొక్కలపై చూపించే అభిమానం అద్భుతమని ప్రశంసించారు. ఆయుర్వేద మొక్కలపై ఇంకా శ్రద్ధ వహించి వాటిని ఇంకా అభివృద్ధి చేయాలన్నారు. ఆమె వెంట నర్సరీ ప్రతినిధులు పుల్లా వీరబాబు, పుల్లా రాజశేఖర్, రైతులు ఉన్నారు.

మెగా రక్తదాన శిబిరం



ధర్మారెడ్డిని అభినందిస్తున్న శ్యామ్‌సుందర్, గుర్రయ్య

రాజమహేంద్రవరం రూరల్: సత్యసాయి శతజయంత్యుత్సవాల్లో భాగంగా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ ఎ.శ్యామ్‌సుందర్ అన్నారు. రాజమహేంద్రవరం సత్యసాయి గురుకులంలో ఆదివారం రక్తదాన శిబిరం, లిక్విడ్ లవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ, బాబా బోధించిన అందరినీ ప్రేమించు, అందరినీ సేవించు సూక్తిని అనుసరించాలన్నారు. ప్రిన్సిపాల్ కె.గుర్రయ్య మాట్లాడుతూ, కార్యక్రమంలో 101 మంది రక్తదానాన్ని, 112 మంది లిక్విడ్‌లవ్ యాప్‌లో వివరాలు నమోదు చేసుకున్నారని వివరించారు. రక్తదాన శిబిరంలో 83వ సారి రక్తదానం చేసిన హుకుంపేటకు చెందిన సామాజిక కార్యకర్త కొవ్వూరి ధర్మారెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి స్వతంత్ర బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, జీఎస్ఎల్ నర్సింగ్ కాలేజీ విద్యార్థులు, జీఎస్‌హెచ్ లేబరేటరీ సిబ్బంది సేవలందించారు.

ఘనంగా అంతర్జాతీయ పాస్టర్స్ దినోత్సవం



డాక్టర్ సరోజిని, రత్నరాజు దంపతులను సత్కరిస్తున్న సంఘ విశ్వాసులు

కడియం: దామిరెడ్డిపల్లి బైబిల్ మిషను మహిమ మందిరం ఆధ్వర్యంలో అంతర్జాతీయ పాస్టర్స్ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సన్నిధి స్త్రీలు, యూత్, సంఘ విశ్వాసులు రెవరెండ్ డాక్టర్ దేవరపల్లి సరోజిని, రత్నరాజు దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం రత్నరాజు మాట్లాడుతూ, దేవుని వాక్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొండేటి ప్రసాద్, పాదూరి ప్రవీణ్, విజయ్, స్వాతి, శ్యామల, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఫార్మేటివ్-2 పరీక్షలు

కంబాలచెరువు: అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఈ నెల 13 నుంచి ఫార్మేటివ్-2 పరీక్షలు నిర్వహిస్తున్నట్టు అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్టోరేజ్ పాయింట్ నుంచి ప్రశ్నా పత్రాలను పంపిణీ చేస్తారన్నారు. ప్రధానోపాధ్యాయులు ఉదయం, మధ్యాహ్నం పరీక్షకు గంట ముందుగా పేపర్లు తీసుకెళ్లాలన్నారు. ఉదయం 8.30కు, మధ్యాహ్నం 12 గంటలకు రావాల్సి ఉంటుందన్నారు. పేపర్స్‌కు వచ్చేటప్పుడు జిప్ ఉన్న క్లాత్ బ్యాగ్‌ని మాత్రమే తీసుకురావాలన్నారు. వాహనాలను నిర్దేశిత పార్కింగ్‌లో ఉంచాలన్నారు.

ప్రాచీన కళలకు పూర్వ వైభవం

- వేల ఏళ్ల క్రితమే విస్తరించిన భారతీయ విజ్ఞానం
- పాశ్చాత్యం వైపు నేటి తరం పరుగులు
- ప్రాచీన భారత జ్ఞాన పునరుజ్జీవనంపై అంతర్జాతీయ సదస్సు
- 14, 15 తేదీల్లో ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహణ
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పాల్గొననున్న ప్రముఖులు



ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ప్రాచీన కళలకు భారతదేశం పుట్టినిల్లు. ఈ పవిత్ర దేశంలో ఎన్నో గ్రంథాలు, వేదాలు, శాస్త్రాలు ఉద్భవించాయి. ఎన్నో అద్భుత గ్రంథాలు అందించబడ్డాయి. కానీ, వాటిని వదిలి పాశ్చాత్య విధానాల వైపు యువత పరుగులు తీస్తోంది. వాతావరణ మార్పులు, మానసిక ఒత్తిడి, అస్థిర జీవనశైలి, పర్యావరణ క్షీణత, సామాజిక అసమానతలు, ఆరోగ్య సంక్షోభాలు తప్పడం లేదు. వేల సంవత్సరాల క్రితం అభివృద్ధి చెందిన జ్ఞానం కేవలం చారిత్రక ఆసక్తికి మాత్రమే పరిమితం కాకుండా, సమకాలీన సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలను అందిస్తోంది.

యోగా, ధ్యానం

ఆధునిక ప్రపంచంలో మానసిక ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్, జీవనశైలి రోగాలు భయంకరమైన స్థాయిలో పెరుగుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 280 మిలియన్ల మంది డిప్రెషన్‌తో బాధపడుతున్నారు. ఈ సందర్భంలో ప్రాచీన భారతీయ యోగా, ధ్యాన పద్ధతులు అద్భుతమైన పరిష్కారాలను అందిస్తున్నాయి. హార్వర్డ్ మెడికల్ స్కూల్ చేసిన అధ్యయనాలు.. ధ్యానం మెదడు నిర్మాణంలోనే మార్పులు తెస్తుందని నిరూపించాయి. యూరోపియన్ దేశాలు, అమెరికాలో యోగా శిక్షణా కేంద్రాలు వేగంగా పెరుగుతున్నాయి. ఐక్యరాజ్య సమితి జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా గుర్తించడం దీని ప్రాముఖ్యానికి నిదర్శనం.

సంపూర్ణ ఆరోగ్యానికి ఆయుర్వేదం

ప్రపంచం రోగాలతో సతమతమవుతున్నపుడు మన దేశంలో ఆయుర్వేదం ద్వారా అనేక దీర్ఘకాలిక రోగాలను నయం చేసేవారు. ఆధునికత వైపు అడుగులు వేసి దేశీయ ఆయుర్వేదాన్ని వదిలేయడంతో దేశంలో అనేక లక్షల మంది అనేక రోగాలతో బాధలు పడుతున్నారు. దానికి కారణం శరీరతత్వానికి చెందిన జ్ఞానం లేకపోవడం, విదేశీవైద్యం వైపు పరుగులు పెట్టడమే.

సుస్థిర నిర్మాణాలకు వాస్తు శాస్త్రం

ప్రాచీన భారతీయ విధానమైన వాస్తు శాస్త్రం పర్యావరణ అనుకూల నిర్మాణ సూత్రాలను అందిస్తుంది. సహజ వెలుతురు, గాలి ప్రసరణ, ఉష్ణోగ్రత నియంత్రణ, శక్తి సామర్థ్యంపై దృష్టి పెడుతుంది. కోణార్క్ సూర్య మందిరం, చార్మినార్, హంపీ నిర్మాణాలు వాస్తు సూత్రాలను అనుసరించి నిర్మించబడ్డాయి. సహజ శీతలీకరణ, వెలుతురు వ్యవస్థలను కలిగి ఉన్నాయి. ఆధునిక ఆర్కిటెక్ట్‌లు ఈనాటి హరిత భవనాల రూపకల్పనలో ఈ సూత్రాలకు ప్రాధాన్యమిస్తున్నారు.

అంతర్జాతీయ సదస్సు

సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం నడయాడిన నేలపై ప్రాచీన భారత జ్ఞాన పునరుజ్జీవనంపై అంతర్జాతీయ సదస్సు ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహిస్తున్నారు. దేశ, విదేశాల నుంచి ప్రతినిధులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పాల్గొనున్నారు. అనేక మంది పరిశోధకులు, విద్యార్థులు, అధ్యాపకులు, విభిన్న రంగాల్లో ప్రతిభావంతులు తమ పరిశోధన పత్రాలను సమర్పించనున్నారు. పురాతన భారతీయ జ్ఞాన సంపద అనేది నేటి ప్రపంచ సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలను అందించే శక్తివంతమైన సాధనంగా తెలియజెప్పడమే ఈ సదస్సు ముఖ్యోద్దేశం.

భారతీయ తత్వం అందరికీ తెలియాలి



ప్రాచీన భారత జ్ఞానాన్ని, కళల గొప్పదనాన్ని భావితరాలకు తెలియజేయడానికి ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. దేశ, విదేశాల నుంచి ప్రముఖులు, ఆన్‌లైన్‌లో ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. వీరు చేసే ఉపన్యాసాలు నేటి తరానికి ఎంతో ఉపయోగపడతాయి. కందుకూరి ఆశయాలకు అనుగుణంగా కార్యక్రమం జరుగుతుంది.

– డాక్టర్ బీవీ తిరువణ్యం, ప్రిన్సిపాల్, ఎస్‌కేవీటీ కళాశాల

గణితంలో విప్లవాత్మక మార్పులు



ప్రాచీన భారతదేశం గణిత శాస్త్రంలో విప్లవాత్మక మార్పులు చేసింది. ఆర్యభట్ట, బ్రహ్మగుప్తుడు, భాస్కరాచార్యులు వంటి మహర్షులు శూన్య భావన, దశాంశ వ్యవస్థ, బీజగణితం, త్రికోణమితి, కలన గణితానికి పునాదులు వేశారు. ఆర్యభట్టీయం గ్రంథంలో భూమి తన అక్షం మీద తిరుగుతుందని అనాడే లెక్కలతో సహా చెప్పారు.

– చీమలమర్రి శ్రీనివాసశర్మ, అంబాసిడర్ ఆఫ్ జైన్ కల్చరల్

ఆశ్రమంలోనే జీవన నైపుణ్యాలు



తక్షశిల, నలంద విశ్వవిద్యాలయాలు ప్రపంచ విద్యార్థులను ఆకర్షించాయి. వీటిలో తత్వశాస్త్రం, వైద్యం, గణితం, ఖగోళశాస్త్రం, రాజనీతి శాస్త్రం, యుద్ధ విద్య, కళలన్నీ బోధించబడేవి. విద్యార్థులు ఆశ్రమంలో నివసిస్తూ జీవన నైపుణ్యాలను కూడా నేర్చుకునేవారు. మహాత్మా గాంధీ అహింస, సత్యాగ్రహ సూత్రాలను ఆధునిక ప్రపంచానికి వర్తింపజేసి, స్వాతంత్ర్యం సాధించారు. వీటినే మార్టిన్ లూథర్‌కింగ్, నెల్సన్ మండేలా వంటి నాయకులను ప్రేరేపించాయి.

– డాక్టర్ పీవీబీ సంజీవరావు, పరిశోధకులు

ఆధునిక సంగీతానికి పునాదులు



శాస్త్రీయ నృత్యాలు కేవలం వినోదం కాకుండా, ఆధ్యాత్మిక సాధన, కథా ప్రదర్శన మాధ్యమాలుగా అభివృద్ధి చెందాయి. భరత మహర్షి నాట్యశాస్త్రం 36 రసాల వ్యక్తీకరణ, శరీర భాషా సూత్రాలను వివరిస్తుంది. కర్ణాటక సంగీతం, హిందుస్థానీ సంగీతం శ్రుతి, లయ, తాళం వ్యవస్థలతో అత్యుత్తమ సంగీత సంప్రదాయాలు. రాగాల సృష్టి, వివిధ కాలాలకు తగిన రాగాలు, సంగీత చికిత్స వంటి భావనలు ఆధునిక సంగీత చికిత్సకు పునాదులు వేశాయి.

– డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్, ప్రముఖ నాట్యాచార్యుడు

ప్రైవేటు రంగంలో 75 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణరాజు



సమావేశంలో మాట్లాడుతున్న సువర్ణరాజు

సీటీఆర్ఐ: ప్రభుత్వం నుంచి సబ్సిడీలు, రాయితీలు పొందుతూ నెలకొల్పుతున్న ప్రైవేట్ రంగంలోని పరిశ్రమల్లో 75 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉందుర్తి సుబ్బారావుతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర పర్యటనలో భాగంగా రాజమహేంద్రవరం విచ్చేసినట్టు తెలిపారు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వం ద్వారా భూములు, బ్యాంకు లోన్లు, ఇతర మౌలిక వసతులు పొంది పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్న పారిశ్రామికవేత్తలు తమ పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో చట్టం చేయడానికి కృషి చేయాలన్నారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు లేకపోవడంతో నిరుద్యోగులు పెరుగుతున్నారని వివరించారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా కల్తీ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని, వీటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. కల్తీ మద్యం తాగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కల్తీ మద్యం అమ్మకాలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఎస్సీ బ్యాక్ లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని ఉందుర్తి సుబ్బారావు కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు తలారి నాని, కోనసీమ జిల్లా అధ్యక్షుడు కన్నిపాముల శ్రీనివాస్, తూర్పుగోదావరి జిల్లా ఇన్‌చార్జి బొమ్మ చినబాబు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో చిన్నారుల ప్రతిభ



బంగారు పతకాలు సాధించిన విజేతలతో కోచ్ శ్రీను

రాజమహేంద్రవరం రూరల్: ఏలూరు సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో ఆదివారం జరిగిన కరాటే పోటీల్లో కవలగొయ్యి గ్రామానికి చెందిన ఎలిట కరాటే క్లబ్ చిన్నారులు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించారు. సికో షోటకన్ అడ్వాన్స్‌డ్ కరాటే-డో ఇండియా, ఆంధ్రప్రదేశ్ జపన్ షోటోకన్ కరాటే డో కన్నింజుకు ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. ఫైట్(కుమిటి) విభాగంలో 31 కిలోల విభాగంలో పి.సుకన్య, 38 కిలోల విభాగంలో ఎం.తేజస్వి, 39 కిలోల విభాగంలో పి.హేమశ్రీ బంగారు పతకాలు సాధించారని కోచ్ పంచికట్ల శ్రీను తెలిపారు.

ప్రేమతో గానామృతం పంచిన బాలు

ఎమ్మెల్సీ సోము వీర్రాజు



ఎమ్మెల్సీకి జ్ఞాపికను అందజేస్తున్న రమణ తదితరులు

ధవళేశ్వరం: పద్మ విభూషణ్, పద్మ భూషణ్, గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ప్రేమతో పాటలు పాడారని ఎమ్మెల్సీ సోము వీర్రాజు కొనియాడారు. బాలు భౌతికంగా లేకపోయినా ఆయన పంచిన గానామృతం సజీవమన్నారు. ఆయన ఆలపించిన పాటలు వింటుంటే ఆనందంగా ఉంటుందన్నారు. రాకా సాంస్కృతిక సంస్థ, గోదావరి కల్చరల్ అసోసియేషన్ సంయుక్తాధ్వర్యంలో ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయం ఎదురుగా ఉన్న పార్కులో పద్మశ్రీ ఘంటసాల విగ్రహం పక్కన ఏర్పాటు చేసిన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నిలువెత్తు విగ్రహాన్ని సోము వీర్రాజు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా బాలు విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ మాట్లాడుతూ, ఎస్పీ బాలు సంగీత ప్రపంచానికి అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, అడిషనల్ కమిషనర్లను రాకా కార్యదర్శి జీవీ రమణ తదితరులు సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మదర్షా ఆలి, తిరుమల కృష్ణమోహన్, గాదిరాజు రామరాజు, మూడెడ్ల రమేష్, పుసులూరి శేషుకుమార్, రాయుడు చంద్రకుమార్, నూజిళ్ల సూరిబాబు, బొబ్బిలి శ్రీనివాస్, ఎర్ర లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌పై పీఎంపీలకు అవగాహన అవసరం



వైద్యులను సత్కరిస్తున్న పీఎంపీ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: గ్రామాల్లో ప్రథమ చికిత్సలు అందించే పీఎంపీలకు బ్రెయిన్ స్ట్రోక్‌పై అవగాహన ఉండాలని స్థానిక నీలిమ న్యూరో హాస్పిటల్‌కు చెందిన న్యూరో వైద్య నిపుణురాలు డాక్టర్ సాయినీలిమ చల్లా అన్నారు. ఆదివారం కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హుకుంపేట గోదావరి రుచులు కాన్ఫరెన్స్ హాల్‌లో సంఘ మండల అధ్యక్షుడు రహమాన్‌ఖాన్ అధ్యక్షతన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథి డాక్టర్ సాయినీలిమ చల్లా మాట్లాడుతూ, మెదడుకు రక్త సరఫరా నిలిచిపోవడం లేదా తగ్గడం వల్ల, మెదడు కణాలు దెబ్బతినడంతో బ్రెయిన్ స్ట్రోక్ వస్తుందని వివరించారు. దీనివలన మెదడుకు రక్తం, ఆక్సిజన్ అందకపోవడంతో కణాలు చనిపోతాయని, ఫలితంగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి శాశ్వత వైకల్యం ఏర్పడవచ్చని విశదీకరించారు. దీనికి తక్షణమే తొలి నాలుగు గంటలలో అత్యవసర వైద్య సహాయం అందిస్తే రోగి పక్షవాతం బారిన పడకుండా కాపాడవచ్చన్నారు. అధిక రక్తపోటు, మధుమేహం, అధిక ఒత్తిడి, ధూమపానం, మద్యపానం బ్రెయిన్ స్ట్రోక్‌కు కారణాలన్నారు. డాక్టర్ క్రొవ్విడి రాజేష్ మాట్లాడుతూ, మెదడుకు, వెన్నెముకకు, నరాలకు సంబంధించిన రుగ్మతలపై అవగాహన కల్పించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు, జిల్లా అధ్యక్షులు బళ్లా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, జిల్లా కోశాధికారి పి.చిన్ని, మండల కార్యదర్శి మట్టా రమేష్, కోశాధికారి యు.ప్రసాద్‌బాబు, ఉపాధ్యక్షులు కేఎస్ఎస్ఎన్ రెడ్డి, సహాయ కార్యదర్శి సుంకర శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు. అనంతరం వైద్యులను ఘనంగా సత్కరించారు.

అలరించిన అష్టావధానం



అవధాన కార్యక్రమంలో పాల్గొన్న పృచ్ఛకులు

సీటీఆర్ఐ: వాగ్దేవి కళాపీఠం ఆధ్వర్యంలో స్థానిక తాడితోట సంహిత డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం సహస్రావధాన భాస్కర గడా కడిమిళ్ల వరప్రసాద్ చేసిన అవధానం అలరించింది. ప్రవచన రాజహంస డాక్టర్ ధూళిపాళ మహదేవమణి సంచాలకత్వం వహించారు. నిషిద్ధాక్షరి సురభి శంకరశర్మ, సమస్య టీఎం భ్రమరాంబిక, వర్ణన వేదాల గాయత్రీదేవి, దత్తపది మునుకుట్ల వేంకట సూర్యనారాయణమూర్తి, ఆశువు నాగులపాటి మహతి తేజశ్రీ, వ్యస్తపాది డాక్టర్ ప్రభల శ్రీవల్లి, పురాణపఠనం ఘట్టి కృష్ణమూర్తి, అప్రస్తుత ప్రసంగం డాక్టర్ కస్తూరి సీతామహాలక్ష్మి, జోరా శర్మ పృచ్ఛకులుగా వ్యవహరించారు. వాగ్దేవి కళా పీఠం వ్యవస్థాపకులు వెంపరాల వేంకట లక్ష్మీశ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అవధానిని, పృచ్ఛకులను సత్కరించారు.

ముగిసిన ఉషూ పోటీలు



ఉషూ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారిణులు

ప్రకాశం నగర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉషూ పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. స్థానిక తుమ్మలావలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో బాలుర విభాగంలో ఎస్.వర్షిక్(విశాఖపట్నం), టి.ఢీలేశ్వర్, ఏడీ ప్రసాద్, ఏపీ చంద్రరావు, డి.చందు, జి.ఆదిత్య(శ్రీకాకుళం), ఎస్.సంతోష్, జి.రాజేష్(తూర్పుగోదావరి), బాలికల విభాగంలో లలితాప్రియ, హర్షిణి (తూర్పుగోదావరి), ప్రేమజ్యోతి, ఐశ్వర్య, సాయిసిరి (విశాఖపట్నం), పావని (గుంటూరు) విజేతలుగా నిలిచారు. వీరికి జిల్లా విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు పతకాలను అందజేశారు. విజేతలు ఈ నెల 28 నుంచి నవంబర్ ఒకటి వరకు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. వర్షం కారణంగా నిలిచిపోయిన బాక్సింగ్ పోటీలు సోమవారంతో ముగుస్తాయని చెప్పారు.

వైభవంగా గంధోత్సవం



గంధాన్ని ఊరేగిస్తున్న భక్తులు

సీటీఆర్ఐ: హజరత్ మహబూబ్ సుభానీ బాబా వారి గంధోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి దర్గా నిషానీ వద్ద సయ్యద్ అమీరున్నీషా ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు జరిగాయి. ఒంటెలు, గుర్రాలు, ఫకీరు మేళాలతో గంధాన్ని ఊరేగించారు. నెహ్రూనగర్, రాజేంద్రనగర్, వై.జంక్షన్ మీదుగా ఊరేగింపు తిరిగి దర్గా నిషానీ వద్దకు చేరింది. గంధ మహోత్సవంలో కులమతాలకు అతీతంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దర్గా నిషానీ అధ్యక్షుడు సయ్యద్ గౌస్‌మొహిద్దీన్ గంధాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

అగ్ని బాధితురాలికి సాయం

కడియం: కడియంలోని పెద్ద చెరువు గట్టుపై జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితురాలు తుమ్మ కాంతమ్మకు ఆదివారం సాయంగా 25 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు అందించారు. రెవెన్యూ అధికారులు సమకూర్చిన 25 కిలోల బియ్యంతో పాటు, నిత్యావసర వస్తువులను ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ అందజేశారు. వీఆర్వో ప్రశంస, రేషన్ షాప్ డీలర్ పానగంటి శంకర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కృషితో ఉత్తమ సమాజం



సత్కారం అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు, డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు

కడియం: ఉత్తమ సమాజం తయారవ్వాలంటే అది ఉపాధ్యాయులపైనే ఆధారపడి ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. కడియం జెడ్పీ హైస్కూల్‌లో బుర్రిలంక వరదా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడియం, రాజమండ్రి రూరల్ మండలాల్లో ఉన్న రాష్ట్ర, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు, మెగా డీఎస్సీ-2025లో ఎంపికైన ఉపాధ్యాయులు 40 మందిని ఆదివారం ఘనంగా సత్కారించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ, ఉపాధ్యాయులే సమాజాన్ని ఉద్ధరించే వారిని, ఉపాధ్యాయుడు సరిగా పనిచేయకపోతే ఆ సమాజమే పాడవుతుందన్నారు. డిప్యూటీ కలెక్టర్లు జి.భీమారావు, మధుసూదనరావు, ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురాం, ఎంఈఓ నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.సత్యనారాయణ సన్మాన గ్రహీతలకు, నూతన ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయుడు రాంబాబు, తులసి వరదా ఫౌండేషన్ వారికి ధన్యవాదాలు చెప్పారు. ఈ సందర్భంగా నాలుగేళ్లుగా పదో తరగతి విద్యార్థులకు లక్షల రూపాయల నగదు బహుమతులు ఇస్తూ ప్రోత్సహిస్తున్న వరదా ఫౌండేషన్ ఆర్గనైజర్, డిప్యూటీ కలెక్టర్ వరద సుబ్బారావును ముఖ్యఅతిథులు కొనియాడారు. సుబ్బారావు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు చిలుకూరు శ్రీనివాస్, గొల్లపల్లి సత్యనారాయణ, బి.సుధ, అనిత, రాజేశ్వరి, మంగాదేవి తదితరులు సన్మానం అందుకున్నారు. డీఎస్సీలో జిల్లాలో రెండో స్థానం సాధించిన వెలుగుబంటి అన్నపూర్ణను డీఈఓ ప్రత్యేకంగా అభినందించారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

కంబాలచెరువు: నగరంలోని సోమాలమ్మ గుడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదివారం శ్రీకాకుళం జిల్లాకు చెందిన వ్యక్తి మృతిచెందాడు. కోటబొమ్మాళికి చెందిన కె.చిరంజీవి(24) రాజమహేంద్రవరంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. శనివారం సోమాలమ్మగుడి వైపు వెళ్తుండగా, పక్కనుంచి వెళ్లిన లోడు లారీ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడు చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు ఝామున మృతిచెందాడు. వన్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు దేవతామూర్తుల ప్రతిష్ఠ

బిక్కవోలు: బలభద్రపురంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో దేవతామూర్తుల ప్రతిష్ఠ సోమవారం నిర్వహించనున్నారు. ఆలయం వద్ద ఏర్పాట్లు చేశారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కంబాలచెరువు: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు విద్యార్థుల స్టడీ మెటీరియల్‌ను జిల్లాలో పలు మండలాలకు యూటీఎఫ్ ఉచితంగా పంపిణీ చేసింది. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఎ.షరీఫ్ ఆదివారం స్టడీ మెటీరియల్ ఆవిష్కరించి, పలు మండలాలకు పంపిణీ చేశారు. కృష్ణా, గుంటూరు జిల్లాల పీడీఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్‌రావు ఆయన తల్లిదండ్రుల పేరిట ఏర్పాటు చేసిన ట్రస్టు ద్వారా అన్ని జిల్లాలకు ఈ మెటీరియల్ ఉచితంగా సరఫరా చేస్తున్నారన్నారు. అనుభవజ్ఞులతో రూపొందించిన ఈ పుస్తకం చదివి అనేక మంది విద్యార్థులు గతంలో విజేతలుగా నిలిచారన్నారు. ఈ ఏడాది కూడా విద్యార్థులు ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా నుంచి ఎక్కువ మంది విద్యార్థులు పోటీ పరీక్ష రాసి స్కాలర్‌షిప్‌లు పొందాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూపస్‌రావు, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం.విజయగౌరి, జిల్లా కార్యదర్శి కె.రమేష్, వివిధ మండలాల ప్రతినిధులు అనిల్‌కుమార్, విజయ్‌బాబు, జి.పద్మ, జి.రాజశేఖర్, పి.రాజు తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు..



శ్యామల	: అరి
సూర్య మినీ	: ట్రాన్
సూర్య ప్యాలెస్	: కాంతారాచాప్టర్-1
స్వామి	: ఓజీ
అనుశ్రీ	: ఓజీ
శివజ్యోతి	: మమ్మీ ఈజ్ బ్యాక్
రాజా	: కాంతారా చాప్టర్-1
ఊర్వశి	: కాంతారా చాప్టర్-1
మేనక	: ఇడ్లీకొట్టు
రంభ	: మిరాయ్
అప్సర	: కాంతారా చాప్టర్-1
అశోక	: కానిస్టేబుల్, శశివదనే
నామవరం	
వీఎస్ మహల్	: కాంతారా చాప్టర్-1
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: కాంతారా చాప్టర్-1
కడియం	
వెంకటసూర్య	: కాంతారా చాప్టర్-1